క్లుప్తంగా

పశుబీమాతో పాడి రైతులకు మేలు

కొనకనమిట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా ప్రవేశ పెట్టిన వైఎస్సార్ పశుబీమాతో పాడి రైతులకు మేలు చేకూరుతుందని గొట్లగట్టు, పెదారికట్ల పశు వైద్యాధికారులు వి.రాజ్యలక్ష్మి, శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పశు వైద్యశాలల్లో పశు పోషకులకు పశు సంరక్షణపై అవగాహన కల్పించారు. నూతన పశుబీమా పథకం గురించి రైతులకు వివరిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారులు వాటా 50 శాతం ఉంటుందన్నారు. గరిష్టంగా ఒక కుటుంబానికి 5 గేదెలు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా వర్తిస్తుందన్నారు. మూడేళ్ల కాల వ్యవధిలో పథకం వర్తిస్తోందని వివరించారు.

మానసిక దివ్యాంగులకు కిట్లు

మార్కాపురం: జిల్లాలోని మానసిక దివ్యాంగులకు ఉచితంగా కిట్లు అందిస్తామని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక దివ్యాంగుల వికాసానికి తోడ్పడే ఈ కిట్ల కోసం కావాల్సిన వారు 73829 12753 నంబర్‌కు తమ దరఖాస్తులు వాట్సప్ చేయాలని తెలిపారు. ఆధార్ కార్డ్, వైట్ రేషన్ కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్లు, ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రాలు, వార్షికాదాయం సంవత్సరానికి రూ.2.70 లక్షల లోపు ఉండే ఆదాయ ధ్రువీకరణ పత్రం పంపాలని సూచించారు. 20 ఏళ్లలోపు మానసిక దివ్యాంగులకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 20లోపు తమ పేర్లు పంపాలని సూచించారు.

తాళ్లూరు మండలంలో పలువురు బదిలీలు

తాళ్లూరు: మండలంలో నలుగురు గ్రామ కార్యదర్శులు వివిధ మండలాలకు బదిలీపై వెళ్లారు. తాళ్లూరు కార్యదర్శి ఎన్‌యూ ప్రసన్నకుమార్ దర్శి మండలం తూర్పు వీరాయపాలేనికి, మన్నేపల్లి క్లస్టర్ కార్యదర్శి నూరుల్లా నాగులుప్పలపాడు మండలం రాపర్లకు, శివరామపురం కార్యదర్శి పద్మజ చీమకుర్తి మండలం మంచికలపాడుకు, నాగంబొట్లపాలెం కార్యదర్శి పగడాల శ్రీనివాసరావు త్రిపురాంతకం మండలం మిట్టపాలేనికి బదిలీపై వెళ్లారు. తాళ్లూరు ఈఓఆర్డీగా మార్టూరు ఈఓఆర్డీ కేజీఎస్ రాజు నియమితులయ్యారు. తాళ్లూరు కార్యదర్శిగా మేదరమెట్ల కార్యదర్శి లక్ష్మీకాంత్ నియమితులయ్యారు. తాళ్లూరు రెగ్యులర్ సర్వేయర్‌గా బాబూరావు నియమితులయ్యారు. తాళ్లూరు రీ సర్వే డీటీగా ప్రశాంత్ నియమితులయ్యారు.

ఇళ్లు వదిలి బయటకు వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రజలు తమ అవసరాల కోసం ఇంటిని వదిలి బయటకు వెళ్లినప్పుడు దొంగలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎల్.సంపత్‌కుమార్ సూచించారు. మండలంలోని పోలవరం, నాయుడుపాలెం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఇంట్లో విలువైన అభరణాలు, నగదు ఉంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడం సరైంది కాదన్నారు. పక్కింటి వారికి తెలియజేయడంతో పాటు గ్రామ మహిళా పోలీసులకు సమాచారం ఇస్తే మంచిదన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఏటీఎం మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నూతన వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

ఫిష్ ఆంధ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏపీఎం హనుమంతరావు

ముండ్లమూరు: మత్స్యకారులు ఫిష్ ఆంధ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం హనుమంతరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం మత్స్యకారులకు దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఫిష్ ఆంధ్ర పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలు పట్టే ప్రతి మత్స్యకారునికి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపార నిర్వహణకు రాయితీపై రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. ఈ అవకాశాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీబీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కో ఆర్డినేటర్ జి.వెంకటరావు, సీసీలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన నగదును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులు కావాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మార్కాపురం, కొనకనమిట్ల మండలాలకు చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. మొత్తం రూ.15.25 లక్షల చెక్కులు అందించారు. ఇందులో కొనకనమిట్ల మండలం చినమనగుండం గ్రామానికి చెందిన మన్నం శివమ్మకు రూ.7 లక్షలు, మార్కాపురం పట్టణానికి చెందిన కురిచేటి ఆంజనేయులుకు రూ.1.60 లక్షల చెక్కు అందించారు. కొనకనమిట్ల మండలం నాగంపల్లికి చెందిన నవ్యకు రూ.2.30 లక్షలు, వాగుమడుగు చెందిన తమ్మిశెట్టి అంజమ్మకు రూ.55 వేలు, బొందలపాడుకు చెందిన కోటయ్యకు రూ.30 వేలు, పొదిలి మండలం సూధనగుంట గ్రామానికి చెందిన పవిత్రకు రూ.3.50 లక్షలు అందించినట్లు ఎమ్మెల్యే కేపీ చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు యూ.శ్రీనివాసులు, బ్రహ్మయ్య, కోలగట్ల శివారెడ్డి, యల్లకర రంగయ్య పాల్గొన్నారు.

రైతులకు మంచి సేవలు అందించాలి


ప్రశంస పత్రాలు పొందిన సిబ్బందితో ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులు రైతులకు మంచి సేవలందించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది 2022–23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజ్ లక్ష్యం రూ.1.25 కోట్లు కాగా సుమారు 1.28 కోట్లు వసూలు చేసి జిల్లాలో ప్రథమ స్థానం పొందిన నేపథ్యంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది మార్కాపురంలోని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి ప్రశంస పత్రాలు అందించి రైతులకు విస్తృతంగా సేవలు అందించాలని సూచించారు. మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ గోలమారి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

మామిడిని సురక్షిత పద్ధతుల్లో మాగబెట్టి విక్రయించాలి

కంభం: మామిడి పండ్లను క్యాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా మాగపెట్టి విక్రయిస్తే మూడేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తారని ఉద్యానవన శాఖ అధికారి శ్వేత మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మామిడి కాయలను సరైన దశలో కోసి సురక్షిత పద్ధతిలో మాగబెడితే అది ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. వ్యాపారులు, రైతులు కాయలు పచ్చిగా ఉన్నప్పుడు కోసి మార్కెట్‌కు పంపిస్తే అక్కడ రసాయనాలతో వాటిని మాగ పెడుతున్నారన్నారు. ఆ విధంగా మాగపెట్టిన కాయలు తినడం ద్వారా తలనొప్పి, జ్ఞాపక శక్తి తగ్గడం, ఇతర అనారోగ్యాలకు గురవుతారని హెచ్చరించారు. రెపనింగ్ చాంబర్‌లో ఎథిలిన్ వాయువు వినియోగించడం, ఎథ్రెల్ 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి తయారు చేసిన ద్రావణంలో కాయలు ముంచి తీసిన తర్వాత ఆరబెడితే మూడురోజుల్లో మాగుతాయని, ఈ పద్ధతులు పాటించి వ్యాపారులు విక్రయించాలని సూచించారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


అన్నదానం ప్రారంభిస్తున్న కామూరి రమణారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. హోమాలు, స్వామివారికి పొంగళ్లు సమర్పణ వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగే వేడుకల్లో కొమరోలు మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. రమణారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు కామూరిని ఘనంగా సత్కరించారు.

కురిచేడు ఏఓగా మధుబాబు


మధుబాబు, ఏఓ

కురిచేడు: మండల వ్యవసాయాధికారిగా పి.మధుబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దర్శి రైతు భరోసా హబ్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన మండలానికి బదిలీపై వచ్చారు. ఇక్కడ వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.జ్యోత్స్నాదేవి ఏడాది క్రితం డిప్యుటేషన్‌పై కనిగిరి వెళ్లారు. ఆమెను తిరిగి అక్కడికే బదిలీ చేయడంతో ఆమె స్థానంలో మధుబాబును నియమించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని డ్వాక్రా బజారులో మెప్మా సిబ్బందితో కలిసి ఆయన మార్కాపురం మున్సిపల్ పరిధిలోని ఆర్పీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ మార్కాపురం మున్సిపల్ పరిధిలో సుమారు 1500 డ్వాక్రా గ్రూపులు, 15 నుంచి 16 వేల మంది వరకు సభ్యులు ఉన్నారన్నారు. 5. 10, 15, 20 ఏళ్ల నుంచి కొంత మంది గ్రూప్ సభ్యులు జాగ్రత్తగా రుణాలు తీసుకుంటూ వ్యక్తిగతంగా వ్యాపారాలు చేస్తూ గ్రూపులను కాపాడుకుంటూ వస్తున్నారని, వీరందరూ ఇప్పటి వరకు గ్రూపులకు వచ్చే రుణాలను వ్యక్తిగతంగా వ్యాపారాభివృద్ధికి వాడుకున్నారని, భవిష్యత్తులో 15 నుంచి 20 లక్షల రూపాయల మధ్య రుణం తీసుకుని భారీ స్థాయిలో ఉత్పత్తులు ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. రుణం తీసుకునే దగ్గర నుంచి మార్కెటింగ్ వరకు మెప్మా అండగా ఉంటుందని, ఈ దిశగా తన వంతు సహకారం కూడా అందిస్తానని చెప్పారు. మహిళా గ్రూపులు ముందుకు రావాలని, మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ కూడా అందించే ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని పట్టణ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి అన్నారు. వివిధ ప్రాంతాలను సందర్శించి మన ప్రాంత ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులు ప్రారంభిద్దామని సూచించారు.

చిన్నారులకు సమ్మర్ క్యాంప్


డ్రాయింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

యర్రగొండపాలెం: వేసవి సెలవుల్లో చిన్నారులు ఉపయోగించుకునే విధంగా శాఖ గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు స్థానిక గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ మంగళవారం తెలిపారు. ఎక్కువగా ప్రాథమిక విద్య చదివే విద్యార్థులు గ్రంథాలయానికి క్రమం తప్పకుండా వచ్చి తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఆట,పాటలతో పాటు చిత్రలేఖనం, పుస్తక పఠనం లాంటివి చేస్తున్నారని, తీవ్రంగా కాస్తున్న ఎండలకు బయట తిరగకుండా సమ్మర్ క్యాంపునకు వచ్చి తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని ఆమె తెలిపారు.

పట్టాభిరామస్వామి కల్యాణంలో ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కంభం: మండలంలోని ఔరంగబాద్‌లో జరుగుతున్న పట్టాభిరామస్వామి కల్యాణ మహోత్సవానికి మంగళవారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సబ్బసాని సాంబశివారెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, వరికుంట్ల సుబ్బారావు, పెద్దకోటేశ్వరరావు, కొత్తపల్లి శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు

గిద్దలూరు రూరల్: బోదకాలు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సంజీవరావు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ సుమయ అన్నారు. మంగళవారం వైద్యశాలలో బోదకాలు బాధితులకు శానిటేషన్ కిట్స్ పంపిణీ చేశారు. వైద్యురాలు మాట్లాడుతూ దోమలతో బోదకాలు వ్యాధి వస్తుందని చెప్పారు. మల్లికార్జున, నాగవేణి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాను వేగవంతం చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ బాబూరావు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబూరావు

రాచర్ల: వైఎస్సార్ బీమాను వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ బాబూరావు అన్నారు. మండలంలోని కాలువపల్లె, రాచర్ల గ్రామాల్లో మంగళవారం ఆమర పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు కలిసి వైఎస్సార్ బీమాను వేగవంతం చేయాలన్నారు. అనంతరం కాలువపల్లె గ్రామంలోని జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు నీటి సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు గృహనిర్మాణం చేసుకోవడం లేదని పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ జిల్లా గృహనిర్మాణశాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే జగనన్న కాలనీలో నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలువపల్లె, రాచర్ల గ్రామాల్లో సచివాలయను తనిఖీ చేశారు. ఎంపీడీవో కె.కవితా చౌదరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్న అబ్బాయి, గృహనిర్మాణశాఖ ఏఈ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరనాయక్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు వస్తువుకు బిల్లు తప్పనిసరి

పెద్దారవీడు: ఎరువుల షాపుల్లో కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగుమందులకు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని ఏఓ బుజ్జిబాయి సూచించారు. మండలంలో దేవరాజుగట్టు ఆర్బీకే పరిధి శివాపురంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ విత్తనాలు, పురుగుమందులు లూజు కొనుగోలు చేయరాదని, ప్రభుత్వం గుర్తింపు పొందిన సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. చిన్నా ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విజేతలకు కప్ అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

పుల్లలచెరువు: యువత క్రీడల్లో రాణించాలని వైపాలెం ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. వారం రోజులుగా పుల్లలచెరువుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కంచర్ల వీరయ్య స్మారకార్థం క్రికెట్‌టోర్నమెంట్ నిర్వహించారు. అందులో భాగంగా 30 టీమ్‌లు తలపడ్డాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో రెండు టీమ్‌లు తలపడగా ఓలంగా టీం మొదటి బహుమతి రూ.25 వేలు, కేవీ యూత్ టీం ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు గెలుపొందాయి. ఏఎంసీ చైర్మన్ బహుమతులు ట్రోఫీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. సొసైటీ డైరెక్టర్ రఘు, ఎంపీటీసీ రాములు, గ్రామ పెద్దలు పి.ప్రసాద్, జి.భాస్కరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గెలుపొందిన టీం సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

పందుల బెడద తొలగించాలి

● మున్సిపల్ చైర్మన్‌కు వినతి

మార్కాపురం: మార్కాపురం మున్సిపాలిటీలో పందుల బెడద తొలగించాలని ఎంపీజే ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో పందుల బెడద ఎక్కువగా ఉండటంతో వాటితో ప్రజలకు రోగాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పందులను ఊరికి దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని చిన్న మసీద్, ఇస్లాంపేట, పూల సుబ్బయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో జనవాసాల మధ్య పందుల పెంపకం ఉందని, అక్కడి నుంచి వాటిని తొలగించాలని ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే రజాక్, పట్టణ కన్వీనర్ షేక్ అమీర్ బాషా విజ్ఞప్తి చేశారు.


చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీజే సభ్యులు

నాణ్యమైన విత్తనాలు రైతులకు చేరువ చేయాలి

● ఘనంగా విత్తన దినోత్సవం


మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాద్

దర్శి: నాణ్యమైన విత్తనాలు రైతులకు చేరువ చేయాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధనా స్థానాలు మంగళవారం విత్తన దినోత్సవాన్ని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్, సైంటిస్ట్ రాజేష్ చౌదరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ రైతులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు పరిశోధనలు చేసి కేవీకేలో పరీక్షలు జరిపి రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. నూతన వంగడాలు సృష్టించి రైతులకు చేరువ చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ సమయంలో ఎంపిక చేసుకోవాల్సిన వంగడాల గురించి వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సహాయ సహకారాలు అందించాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. బాపట్ల వ్యవసాయ శాస్త్రవేత్తలు కృష్ణవేణి, సాంబశివరావు, ఏఓ బాలకృష్ణ నాయక్, జిల్లా వనరుల కేంద్రం అధికారి ప్రభాకర్‌రావు, కేవీకే అధికారులు ఉషా, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరు: రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. తూర్పుగంగవరంలో విత్తనాలు అమ్మె దుకాణాల్లో స్టాకును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే దుకాణదారులు అమ్మాలని సూచించారు. వీఏఏ సుమ పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి



మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

పుల్లలచెరువు: ప్రభుత్వాలు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కుందంపల్లిలో యర్రగొండపాలెం నియోజకవర్గ రైతు సంఘం రెండో మహాసభ నిర్వహించారు. సభకు వెంకట నారాయణ అధ్యక్షత వహించారు. తొలుత రైతు సంఘ జెండా ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2,500 కోట్లు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కేంద్రంలో పీఎం నరేంద్రమోదీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాయమాటలు చెబుతోందని దుయ్యబట్టారు. రాష్ట్ర రైతు సంఘ కౌన్సిల్ సభ్యుడు వీరారెడ్డి, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు దేవుండ్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మోహన్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణగౌడ్, మండల కార్యదర్శి గురునాథం, త్రిపురాంతకం కార్యదర్శి రామయ్య, రైతు నాయకులు నక్కా తిరుపతయ్య, శ్రీనివాసరావు, శేషయ్య పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై తిరుమలనాథస్వామి


పూజలు చేస్తున్న అర్చకుడు భవానీప్రసాద్

రాజంపల్లి (పెద్దారవీడు): మండలంలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. హనుమంత వాహనంపై స్వామి వారు అశీనులై ఆలయ ప్రాంగణంలో భాజాభజంత్రీలతో పాటు భక్తులు భక్తి పాటలు పాడుకుంటూ ఊరేగించారు. ఉభయదాతలుగా మాచర్లకు చెందిన డాక్టర్ కమలాసనరావు దంపతులు, ప్రగళ్లపాడు గ్రామానికి చెందిన ఓరుగంటి రామయ్య కుమారులు వ్యవహరించారు. బుధవారం ఉదయం రాష్ట్రస్థాయి ఆరు పండ్ల సైజు విభాగంలో పశు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కరుణించమ్మా స్వర్ణమ్మ తల్లీ!

● వైభవంగా తిరునాళ్ల


స్వర్ణలో పూజలందుకుంటున్న స్వర్ణమ్మ తల్లి

కారంచేడు: కరుణించి, కాపాడమ్మా.. మా తల్లి.. స్వర్ణమ్మ తల్లీ అంటూ గ్రామస్తులు అమ్మవారికి శరణు వేడుకున్నారు. గతంలో సుమారు వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ళు మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, అడిగిందే తడవుగా వరాలు అందించే గ్రామ దేవతగా విరాజిల్లుతున్న స్వర్ణమ్మకు భక్తులు విశ్వాసంతో పూజిస్తారు. సోమవారం అమ్మవారికి గ్రామ ఆడపడుచులు ఎక్కడ ఉన్నా గ్రామానికి వచ్చి పసుపు–కుంకమలు సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో అందుబాటులో ఉండే ప్రతి ఒక్కరూ వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి స్వర్ణమ్మ తల్లికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి గ్రామ దేవతకు నైవేద్యాలను సమర్పించారు. ప్రతి సంవత్సరం వందలాది మంది భక్తులు పాల్గొనే స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ళను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ఘటాలను ఊరేగించారు. నియమ, నిష్ఠలతో కూడిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి వాహనాలను ఆలయం చుట్టూ తిప్పుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 150 అడుగుల విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అమ్మవారి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.

నూతన పాలకవర్గం ఎన్నిక

అద్దంకి: అద్దంకిలోని భవాని సెంటర్ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానానికి మంగళవారం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పోతేపల్లి రాము, ఉపాధ్యక్షుడుగా దాచేపల్లి వెంకట మారుతి, కార్యదర్శిగా చోడా వెంకటేశ్వర్లు, ఉప కార్యదర్శిగా కొండముది ఆంజనేయులు, కోశాధికారిగా బహునాథం శ్రీనివాసరావు, ఉపకోశాధికారిగా ఫణిదం శ్రీనివాసరావు, సభ్యులను ఎన్నుకున్నారు.

60 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యం బస్తాల వద్ద విజిలెన్స్ అధికారులు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం–శివరామపురం అడ్డ రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న 60 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి విజిలెన్స్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం ప్రకారం.. విజిలెన్స్ సీఐ రాఘవరావు, సుబ్బారావుల నేతృత్వంలో దాడి చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణమోహన్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజిలెన్స్ అధికారి బడే సంగమేశ్వరరెడ్డి, ఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.